క్లుప్తంగా

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



వాజేడు: మండల కేంద్రంలోని ప్రైమరీ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పెన్నులు, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. చీకుపల్లి గ్రామానికి చెందిన గొంది నర్సింహరావు గత సంవత్సరం మృతి చెందారు. ఆయన మృతికి జ్ఞాపకంగా అతని కూతురు విష్ణుప్రియ, మృతుడి తమ్ముడు నారాయణ విద్యార్థులకు పెన్నులు, నోట్ పుస్తకాలను అందించారు.

అసాంఘిక శక్తులపై అప్రమత్తంగా ఉండాలి



వెంకటాపురం(కె): అసాంఘిక శక్తులపై అప్రమత్తంగా ఉండాలని వెంకటాపురం సీఐ బండారి కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తిప్పాపురం గ్రామంలో కార్డన్ సర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో సమావేశం నిర్వహించి గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం సీజన్‌లో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉన్నందున గామస్తులు చేపలను పట్టేందుకు వెళ్లొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తిరుపతి రావు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు ఉన్నారు.

మంత్రికి కృతజ్ఞతలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం మద్దులపల్లి క్రాస్‌రోడ్డు నుంచి కుంట్లం వరకు పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో రోడ్డు పనులు చేపట్టాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాలు ఇవ్వడంతో రెండు రోజుల కిందట మహదేవపూర్‌కు వచ్చిన సందర్భంలో పీఆర్ ఇంజనీర్లు రూ.12 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆయనకు తెలిపారు. శుక్రవారం పలుగులకు రవాణా కష్టాలు తీరుతాయని గ్రామస్తులు మంత్రికి శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఉపసర్పంచ్ మానెం మహేష్, వడ్లకొండ సమ్మయ్య, ఒద్ది చంద్రయ్య, ఆర్‌ఎంపీ వైద్యుడు శంకర్, మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, మచ్చ రాజయ్య, కిష్టయ్యలు ఉన్నారు.

గేట్‌వాల్వ్‌లో పడిన గేదె

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పాతబెగుళూర్ గ్రామంలో మిషన్ భగీరథ గేట్‌వాల్వ్‌లో పైకప్పు లేకపోవడంతో శుక్రవారం ప్రమాదవశాత్తు గేదె పడిపోయింది. దీంతో స్థానికులు గమనించి సురక్షితంగా పైకి తీశారు. పైకప్పు తీసి ఉంచడంతోనే ప్రమాదాలు నెలకొంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో చోరీ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో చోరీ జరిగింది. గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి గర్భగుడిలోకి ప్రవేశించి అమ్మవారి ఆలయంలో శివలింగం (వెండి) బిళ్ల, లక్ష్మీ అమ్మవారి(వెండి)బిళ్లలతో పాటు బీరువా లాకర్ పగులగొట్టి అందులోని రూ.300ల వరకు ఉన్న నగదును దొంగలించినట్లు పూజారి రాజేంద్రప్రసాద్ గౌతమ్ తెలిపారు. ప్రధాన పూజారి లేకపోవడంతో ఇంకా ఏమైన విలువైన ఆభరణాలు చోరీకి గురయ్యాయా తెలియాల్సి ఉంది. చోరీ జరిగిన ఆయలంలో ఎస్సై చక్రపాణి సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించారు. వరుస చోరీలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పోలీసులకు కంటిమీద కునుకులేకుండా మారిందని చర్చ జరుగుతుంది.

ఎల్‌ఓసీ అందజేత



మల్హర్: మండలంలో తాడిచర్ల గ్రామానికి చెందిన నీలం రవళి చర్మ వ్యాధికి సంబంధించిన అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. సహాయం కోసం కుటుంబ సభ్యులు మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీఎం ఆర్‌ఎఫ్ ద్వారా రూ.1.10 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేశారు. హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎల్‌ఓసీ పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందించారు.

దోమల నివారణకు చర్యలు

టేకుమట్ల: వర్షాకాలంలో దోమల నివారణకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం జీపీ సిబ్బంది ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి అడగాని సాంబశివరావు మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలతో ప్రజలు విషజ్వరాల బారిన పడే అవకాశం ఉందని, ముందస్తుగా పాగింగ్ చేపించినట్లు తెలిపారు. దోమలు లార్వా దశలనే అంతమొందిస్తే దోమల బెడద నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. అలాగే గ్రామస్తులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి పరిసరాలల్లో వ్యర్థపు నీటి నిల్వలను నివారించి, ప్రతీ ఇంటికి ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

గిరిజనుల రక్షణ కవచం 'పెసా'

- సమ్మక్క–సారలమ్మ జిల్లా పేరు మార్పుపై ఏకగ్రీవ తీర్మానం
- హేమాచల క్షేత్రం చైర్మన్, డైరెక్టర్లను ఆదివాసీలకు కేటాయించాలి
- ఐటీడీఏ పెసా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్



గ్రామసభలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ ప్రభాకర్

మంగపేట: ఏజెన్సీ ప్రాంతాలకు పెసా చట్టం గిరిజనులకు రక్షణ కవచం లాంటిదని ఏటూరు నాగారం ఐటీడీఏ పెసా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్ అన్నారు. మండలంలోని మల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని గిరిజన అవాస ప్రాంతమైన మామిడిగూడెంలో పెసా గ్రామసభ శుక్రవారం జరిగింది. కుల ఆచార సాంప్రదాయ పెద్దలు జజ్జరి ఎల్లయ్య, పెద్ది సతీష్, డ్వాక్రా మహిళా కార్యదర్శి కుంజ నిర్మల, పెసా అధ్యక్ష కార్యదర్శులు కల్తి ఆనందరావు, యాలం రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రభాకర్ హాజరై మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలోని భూమిపై పూర్తి హక్కులు గిరిజనులకే ఉంటాయన్నారు. గిరిజనేతరులు భూక్రయ విక్రయాలు చేయడం చట్ట విరుద్ధమన్నారు. ప్రతి అభివృద్ధి పనులను ట్రైబల్ వీడీసీల ద్వారానే పనులు కొనసాగిస్తూ పెసా నిబంధనలు పాటించాలన్నారు. అనంతరం పలు అంశాలపై పెసా నిబంధనల ప్రకారంగా చేతులు ఎత్తి ఏకగ్రీవ తీర్మానం చేశారు. ములుగును సమ్మక్క–సారలమ్మ జిల్లాగా నామకరణం చేయాలని, మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్, డైరెక్టర్లను ఆదివాసీలతోనే భర్తీ చేయాలని తీర్మాణించారు. అనాదిగా ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, రెవెన్యూ భూములకు పట్టాలు ఇవ్వాలని, గుంబా, బెల్టు షాపులను పూర్తిగా నియంత్రించాలని తీర్మాణం చేశారు. కమలాపురంలో బిల్ట్ ఫ్యాక్టరీ స్థానంలో నూతనంగా నిర్మించే కార్మాగారంలో ఉద్యోగాల్లో స్థానిక ఆదివాసీలతో భర్తీ చేయాలని మరో 25 అంశాలపై గ్రామ సభలో ఏకగ్రీవ తీర్మాణం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై టీవీఆర్ సూరి, పంచాయతీ కార్యదర్శి మోడెం రాజేష్, హేమాచల క్షేత్రం జూనియర్ అసిస్టెంట్ సీతారాములు, పెసా మొబిలైజర్ తాటి విజయ్‌బాబు, ఎఫ్‌బీఓ విజయరావు, ట్రాన్స్‌కో అధికారి రవి, ఐకేపీ సీసీ జనార్దన్, హెచ్‌ఎం వెంకన్న, గిరిజన సంఘాల నాయకులు నల్లెబోయిన లక్ష్మణ్‌రావు, మారబోయిన గోవర్ధన్, యాలం కాంతారావు, కోరె నర్సింహులు 250 మంది గ్రామస్తులు పాల్గొన్నారు.

సమాన హక్కులు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంగపేట: నేతకాని కులస్తులకు గిరిజనులతో సమాన హక్కులు కల్పించాలని నేతకాని మహార్ హక్కుల పరిరక్షణ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మండల కమిటీ అధ్యక్షుడు జాడి సాంబశివరావు ఆధ్వర్యంలో నేతకాని కులస్తుల సమస్యపై పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ వీరస్వామికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులతో మమేకమై జీవిస్తున్న నేతకానిలకు గిరిజనులతో పాటు సమాన హక్కులు కల్పించాలని, నేతకాని కులస్తుల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. హైదరాబాద్ వేదికగా ప్రత్యేక నేతకాని భవన్ నిర్మించాలని, విద్య, ఉద్యోగాల్లో తగిన ప్రాధాన్యం కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల ఉపాధ్యక్షుడు కొండగొర్ల రాంబాబు, భీం సైనిక్ దళ్ అధ్యక్షుడు జిమ్మిడి నాగేష్, కోశాధికారి దీగొండ శ్రీను, నాయకులు కావిరి నారాయణ, దీగొండ బాబు, దుర్గం శ్రీను, గోమాసు నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మన చేతుల్లోనే దోమల నివారణ



వాజేడు: నీటిని పార బోస్తున్న సిబ్బంది



వెంకటాపురం(కె)లో..

వాజేడు: దోమలను నివారించడం మన చేతుల్లోనే ఉందని వాజేడు వైద్యాధికారి మధుకర్ అన్నారు. మండల పరిధిలోని జగన్నాథపురం, నాగారం, ప్రగళ్లపల్లి గ్రామాల్లో శుక్రవారం ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లల్లో డ్రమ్ములు, టైర్లు, ఇతర వస్తువుల్లో నిల్వ ఉన్న నీటిని పార బోశారు. మురుగు నీటి గుంతల్లో టీమో పాస్ మందును చల్లారు. గ్రామాల్లో బ్లీచింగ్ చల్లించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మధుకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దోమ తెరలను వాడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల వ్యాప్తికి మనం కారణం కావొద్దన్నారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యురాలు గ్నానస, కోటిరెడ్డి, శేఖర్, చిన్న వెంకటేశ్వర్లు, చాయాదేవి, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

గ్రామాల్లో ఇంటింటి ఫీవర్ సర్వే

వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఓంటిమామిడి, తిప్పాపురం, మొట్ల గూడెం గ్రామాల్లో శుక్రవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటి ఫీవర్ సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఇంట్లో ఎంత మంది కుటుంబ సభ్యులు ఉన్నారు, వారిలో జ్వరాలతో ఎవరైన బాధ పడుతున్నారా అనే విషయాలను సర్వే నిర్వహించారు. అనంతరం ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా గ్రామంలో మురుగు నీటిని తొలగించడంతో పాటు ఇంటిలో ఉన్న నిల్వ నీటిని తొలగించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలని ధర్నా



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

వాజేడు: విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గుడిసె వాసులు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. గుడిసెల ప్రాంతం నుంచి విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చిన వారు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. చిమ్మ చీకట్లల్లో మగ్గుతున్నామని, పాములు, తేళ్లు ఏది వచ్చిన తమకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని, ఎలాంటి ప్రమాదం జరుగక ముందే తమకు విద్యుత్ లైన్ వేసి సరఫరా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అరంతరం ఏఈ అర్షద్ అహ్మద్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ ధర్నాలో దేవయ్య, కృష్ణ బాబు, ముత్తయ్య, సురేష్, సమ్మక్క, యశోద, సోనియా రాణి, సీత తదితరులున్నారు.

ప్రజాసేవలో ముందుండాలి



శ్రీలతను సన్మానిస్తున్న నాయకులు

వెంకటాపురం(ఎం): ప్రజా సేవే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మిల్కూరి అయిలయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీటీసీ–1 సభ్యురాలిగా ఐదేళ్లు పనిచేసిన జంగిలి శ్రీలత రవి దంపతులను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా అయిలయ్య కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. పదవులు ఉన్న లేకున్నా ప్రజాసేవలో ముందుంటూ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదలందరికీ అందేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చెన్నోజు శ్రీనివాస్, కూరెళ్ల రామాచారి, కొంపెల్లి రాజిరెడ్డి, భూస సాంబయ్య, జాకీర్, అల్లాడి రాజేశ్వర్‌రావు, నల్లా కోటి, తోట రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్ట్ సరికాదు



వెంకటాపురం (ఎం) పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు



ఎస్ఎస్ తాడ్వాయిలో..

ఎస్ఎస్‌తాడ్వాయి: ప్రభుత్వం పోలీసులతో అక్రమ అరెస్టులు చేయించడం సరికాదని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అన్నారు. టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడి కార్యక్రమం సందర్భంగా శుక్రవారం ముందస్తుగా బీఆర్ఎస్, బీజేపీ, బీజేవైఎం నాయకులను తాడ్వాయి పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకతుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికి ఉందన్నారు. మేడారం జాతర మాజీ చైర్మన్ రేగా నర్సయ్య, మాజీ ఉప సర్పంచ్ ఆలేటి ఇంద్రాసెనరెడ్డి, తాడ్వాయి గ్రామ కమిటీ అధ్యక్షుడు బంగారు సాంబయ్య కామరం గ్రామ కమిటీ అధ్యక్షుడు కోర్నిబెల్లి శేషగిరి, బీజేపీ నాయకులు భర్తపురం నరేష్, డ్యాగల సలేందర్ ఉన్నారు.

యూత్ నాయకుల ముందస్తు అరెస్ట్

వెంకటాపురం(ఎం): టీజీపీఎస్ ముట్టడి నేపథ్యంలో మండలంలో బీజేపీ యూత్ నాయకులతో పాటు బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్ట్ చేసినట్లు వెంకటాపురం ఎస్సై జక్కుల సతీష్ తెలిపారు. శుక్రవారం ఉదయం బీఆర్ఎస్‌కు చెందిన అంతటి రాము, ముడిగె రాజ్‌కుమార్, బీజేపీకి చెందిన గంగుల రాజ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, శ్రీనుతో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకొని సాయంత్రం సొంత పూచీకత్తుపై వదిలిపెట్టినట్లు ఎస్సై వెల్లడించారు.

ప్రభుత్వ కార్యాలయంలో విగ్రహాన్ని తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గీతాబాయి

కాళేశ్వరం: మహదేవపూర్ ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలో మాజీ స్పీకర్ శ్రీపాదరావు స్మారక విగ్రహం పెట్టడం విడ్డూరంగా ఉందని, వెంటనే తొలగించాలని బీఆర్ఎస్ మంథని నియోజకవర్గం మహిళా నాయకురాలు కేదారి గీతాబాయి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ మంథనిలో మహనీయుల విగ్రహాలు పెట్టడం జరిగిందన్నారు. ఇప్పుడేమో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వ కార్యాలయంలో విగ్రహాలు పెట్టి తమ నేత మెప్పు పొందడానికి ఇక్కడ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. విగ్రహం తొలగించకపోతే పోరాటం చేస్తామన్నారు. ఆమె వెంట మల్హర్ మండలం మహిళా నాయకులు పంతకాని చంద్రకళ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



గోవిందరావుపేట: గోవిందరావుపేట మండల ఎంపీడీఓ గార్లపాటి జవహర్ రెడ్డి తల్లి రాధ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా హనుమకొండలోని జవహర్ రెడ్డి నివాసంలో గార్లపాటి రాధ చిత్రపటానికి తాజా మాజీ ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ తుమ్మల హరిబాబు, చల్వాయి మాజీ ఎంపీటీసీ 1 గుండెబోయిన నాగలక్ష్మీ అనిల్ యాదవ్, చల్వాయి ఎంపీటీసీ 2 చాపల ఉమాదేవి నరేందర్ రెడ్డిలు శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కమలాపురంలో ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి వైశాలి

మంగపేట: మండలంలోని కమలాపురంలో సీపీనగర్‌లో మంగపేట పీహెచ్‌సీల వైద్యాధికారి వైశాలి ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తులతో పాటు జ్వరం ఒంటి నొప్పులు, దగ్గు జలుబుతో ఇబ్బంది పడుతున్న వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించి మందులను పంపిణీ చేశారు. ఫ్రై డే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి నిల్వ ఉన్న నీటిని తొలగించారు. కలుషిత నీటిని తాగకుండా కాచివడపోసి చల్లార్చిన నీటిని తాగాలని, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. మలేరియా, డెంగీ వంటి జ్వరాల బారిన పడకుండా దోమ తెరలను వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ విజిటర్ ప్రసన్న, ఏఎన్ఎం సులోచన, ఆశ కార్యకర్తలు ప్రభావతి, సంధ్య, నీలిమ పాల్గొన్నారు.

ఇద్దరు నిందితుల అరెస్ట్

కాటారం: మండలకేంద్రానికి చెందిన గంట మహేశ్, మహాముత్తారం మండల కేంద్రానికి మాడెం తరుణ్‌లను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కాటారం ఎస్సై అభినవ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గంట మహేశ్ మే నెల 9న స్థానిక రాయల్ మండి రెస్టారెంట్‌లో తన స్నేహితులు మాడెం తరుణ్, పెద్దపేట రాజ్‌కుమార్, పంతకాని వినయ్‌లతో కలిసి బిర్యాని తిని డబ్బులు విషయంలో సదరు యజమానిపై దాడి చేయడంతో యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి నిందితులు పరారీలో ఉన్నారు. మే 28న మండలంలోని ఆదివారంపేట శివారులో బైక్‌పై వెళ్తున్న మోతె సమ్మయ్యను బైక్‌తో ఢీ కొట్టి, దాడి చేసిన మరో కేసులో మాడెం తరుణ్ నిందితుడిగా ఉన్నాడు. ఈ రెండు కేసుల్లో నిందితులుగా ఉన్న గంట మహేశ్‌ను మండల కేంద్రంలో పట్టుకోగా, మాడెం తరుణ్‌ను మహాముత్తారం పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా ఈ కేసులతో పాటు కొండ రాజబాబు అనే వ్యక్తిని కత్తితో పొడిచి గాయపర్చిన కేసులో పంతకాని వినయ్ అనే యువకుడిని సైతం గత నెల 22న అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు వివరించారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గర్భిణులకు పోషకాహారం అందిస్తున్న సిబ్బంది

కన్నాయిగూడెం: మండలంలో చేపట్టిన నీతి అయోగ్‌లో భాగంగా చేపట్టిన ఆస్పిరేషనల్ బ్లాక్ తో సంపూర్ణ అభివృద్ధి జరుగుతుందని ఎంపీడీఓ అనిత అన్నారు. శుక్రవారం మండలంలోని రాజన్నపేట, ముప్పనపల్లి గ్రామాల్లో ఆస్పిరేషనల్ బ్లాక్‌లో భాగంగా చేపట్టిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమం ఈ రోజు నీతి అయోగ్ ఆస్పిరేషనల్ కో ఆర్డినేటర్ రవిష్ ఆధ్వర్యంలో అధికారులతో ప్రారంభించి పనులను చేపట్టారు. అందులో భాగంగా సూచించబడిన ఆరు సూచికలను అమలు చేస్తూ ప్రజలకు అవగాహన కలిపించారు. గర్భిణులకు వైద్య విభాగంలో భాగంగా వైద్య పరీక్షలు చేసి ప్రాథమిక నమోదు చేసి, మాత శిశు సంక్షేమంలో వారికి కావాల్సిన పోషకాహార పదార్థాలను అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అభినవ్, సీడీపీఓ హేమలత, ఐసీడీసీ సూపర్‌వైజర్‌లు శ్రీవిద్య, మనోరమ, అంగన్ వాడీ టీచర్‌లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దు



గిరిజనులతో మాట్లాడుతున్న సీఐ రవీందర్

పస్రా సీఐ రవీందర్

గోవిందరావుపేట: అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దని పస్రా సీఐ జి. రవీందర్ అన్నారు. శుక్రవారం పస్రా పోలీస్‌స్టేషన్ పరిధిలోని పందిరిదోన గుత్తికోయ గూడెంను ఎస్సై కమలాకర్, సిబ్బందితో సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ గిరిజన ప్రజలతో మాట్లాడుతూ ఎవరైన కొత్త వ్యక్తులు గ్రామానికి వస్తే తమకు సమాచారం అందించాలన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక మైన కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పందిరిదోన గుత్తికోయ గూడెం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వానాకాలం దృశ్య వరదలు సంబవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై కమలాకర్ మాట్లాడుతూ వర్షాకాలంలో రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ట్రాక్టర్ల ట్రాలీలకు రేడియం స్టిక్కర్లు

రోడ్డు ప్రమాదాల నివారణకు పస్రా సీఐ రవీందర్ వినూత్న ఆలోచనతో ప్రజల మన్ననలు పొందుతున్నారు. మండల పరిదిలోని మొద్దుల గూడెం గ్రామంలో ట్రాక్టర్లు అన్నింటికి రేడియం స్టిక్కర్లు అంటించారు. తద్వారా రాత్రి పూట వాహనం ఆగి ఉన్నా.. వెనుక నుంచి వస్తున్న వాహనాలు వాటిని గుర్తించి ప్రమాదం జరుగు అవకాశాన్ని తగ్గించవచ్చన్నారు. సీఐ ఆలోచనలకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఐని కలిసిన యూత్ నాయకులు

పస్రా సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రవీందర్‌ను మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు చింత క్రాంతితో పాటు జక్కు రణదీప్ గౌడ్, యూత్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని పస్రా సీఐ రవీందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని దామెరవాయి గ్రామంలో సైబర్ నేరాలపై, సీసీ కెమెరాల ఏర్పాటుపై సీఐ రవీందర్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డిలు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రవీందర్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల చేతుల్లో మోసపోవద్దన్నారు. సెల్‌ఫోన్ మేసేజ్‌లకు స్పందించవద్దన్నారు. సైబర్ నేరాలకు మోసపోతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తమవంతుగా రూ.3వేలు విరాళం అందజేశారు. జ్వాలా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇటీవల దమెరవాయి గ్రామంలో ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరంలో రక్తదానం చేసిన 18 మందికి గొడుగులను సీఐ రవీందర్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



రవీందర్ (ఫైల్)

కన్నాయిగూడెం: మండల పరిధిలోని చింతగూడెంకు చెందిన గాదం రవీందర్ (27) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో సింగారం గ్రామ సమీపాన అడవిలో మృతి చెందాడు. ఎస్సై వెంకటేష్ కథనం ప్రకారం... చింతగూడెం గ్రామానికి చెందిన గాదం రవీందర్ మంగళవారం ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. ద్విచక్ర వాహనాన్ని సింగారం గ్రామానికి సమీపాన ప్రధాన రోడ్డుపై ఉంచాడు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా కనబడలేదు. శుక్రవారం అడవి పనులకు వెళ్లిన వ్యక్తులకు చనిపోయిన వ్యక్తి మృతదేహం కనబడటంతో బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి సోదరుడు కత్తరసాల స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి ఏటూరునాగారం సీఐ శ్రీనివాస్, ఎస్సై వెంకటేశ్ చేరుకుని మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొంపెల్లికి కేటీపీపీ స్కూల్ వ్యాన్



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని కొంపెల్లి గ్రామానికి జెన్‌కో ఆధ్వర్యంలో స్కూల్ వ్యాన్‌ను ఏర్పాటు చేశారు. శుక్రవారం గ్రామంలో జెన్‌కో అధికారులు, ఉద్యోగులు వ్యానును ప్రారంభించారు. కొంపల్లి గ్రామ ఉద్యోగస్తుల కొరిక మేరకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ సహకారంతో కేటీపీపీ సీఈ సిద్దయ్య ఆదేశాల మేరకు స్కూల్ వ్యాన్ వస్తుందని అధికారులు తెలిపారు. కొంపల్లి గ్రామానికి చెందిన పిల్లల తల్లిదండ్రులు, పిల్లలను కేటీపీపీ పాఠశాలలో చేర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు గ్రామస్తులు పాల్గొన్నారు.